aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
మంగళవారం
17-02-2026 సంపుటి : 01 సంచిక : 20 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY


BESQATI
besqati.com
Contact : info@besqati.com

# కాంగ్రెస్‌దే పైచేయి

## హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

- ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా
- ఎక్స్ అఫీషియో సభ్యుల బలంతో కాంగ్రెస్ పైచేయి
- ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్
- కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ప్రకటన
- కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బీజేపీ
- కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

**హైదరాబాద్ -16ఫిబ్రవరి (మహాప్రభ).**
మున్సిపల్ పాలక మండలి ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ జోరు కొనసాగింది. మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో సత్తా చాటింది.మొత్తం 116 మున్సిపాల్టీల్లో కోరం లేక 11 మున్సిపాల్టీల్లో ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. మిగిలిన 105 మున్సిపాల్టీల్లో మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ సందర్భంగా హంగ్ ఏర్పడిన మున్సిపాల్టీల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. మొత్తం 36 మున్సిపాల్టీల్లో హంగ్ ఏర్పడగా, -మిగతా 3 లో





### ఫ్యూచర్ సిటీలో
## 'హెల్త్ సిటీ'

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో మారుమూల ప్రాంతాలకు వైద్యం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

**హైదరాబాద్ -16ఫిబ్రవరి (మహాప్రభ).**
అంతర్జాతీయ ప్రమాణాలతో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 'హెల్త్ సిటీ'ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్‌ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో మారుమూల ప్రాంతాలకూ వైద్య సౌకర్యాలను చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం టీ హబ్ లో 'టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీఏఎల్ హాస్పిటల్స్ హెల్త్ ఫెస్ట్-2026' ఫైర్‌సైడ్ చాట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పౌరులందరికీ హెల్త్ ప్రొఫైలింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మహిళలకు ముందస్తు క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల -మిగతా 3 లో



## నేటి నుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

- రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
- సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, -16ఫిబ్రవరి (మహాప్రభ).**
తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ -మిగతా 3 లో

### రష్యా నిర్ణయంపైనే
## బంగారం ధరలు

- డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి
- అంతర్జాతీయ నిపుణుల వెల్లడి

**న్యూఢిల్లీ, -16ఫిబ్రవరి (మహాప్రభ).**
అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థతి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా
-మిగతా 3 లో



### చంద్రబాబుతో బిల్‌గేట్స్
## బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

- శ్రీవారి విశిష్టతను వివరించిన చంద్రబాబు
- ఇంట్లోని నిలువెత్తు విగ్రహం చూపించిన బాబు
- వ్యవసాయ క్షేత్రం సదర్శించి పంటలపై ఆసక్తి

**అమరావతి,-16ఫిబ్రవరి (మహాప్రభ).**
:గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు
-మిగతా 3 లో





### ఇక ఈ అవమానాన్ని
## భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన

**జగిత్యాల, -16ఫిబ్రవరి (మహాప్రభ).**
కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. చైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు.
-మిగతా 3 లో

### కరీంనగర్‌పై
# బీజేపీ జెండా

## 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం

- మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక
- డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక
- కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు
- బీజేపీకి లాభించిన బీఆర్ఎస్ తటస్థ వైఖరి
- దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం


**కరీంనగర్,-16ఫిబ్రవరి (మహాప్రభ).**
తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. -మిగతా 3 లో



## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

- ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం
- ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిద
- ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం

**జయపుర,-16ఫిబ్రవరి (మహాప్రభ).**
రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు.
-మిగతా 3 లో






## పశువులకూ ముఖ ఆధారిత గుర్తింపు!

- ముక్కు మీద చర్మం ముడతల వివరాల నమోదు
- అక్రమంగా రవాణా అయ్యేవాటిని గుర్తించే అవకాశం

**అమరావతి,-16ఫిబ్రవరి (మహాప్రభ).**
మనుషులకు ఆధార్ నంబరు, ఫింగర్ ప్రింట్, కంటి ఐరిస్ ఉన్నట్లే.. పశువులకూ ముఖ ఆధారిత (ముక్కు మీద చర్మం ముడతల ఆధారంగా) గుర్తింపు సంఖ్య ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'గో-ఆధార్' పేరుతో తిరుపతి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను పశు సంవర్ధక శాఖ ఇప్పటికే చేపట్టింది. ఆ జిల్లాలో దాదాపు 4లక్షల పశువులు ఉండగా, 1.02 లక్షల పశువులకు ముఖ ఆధారిత గుర్తింపును నమోదు చేశారు. అక్కడ ఈ విధానం సక్సెస్ కావడంతో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా -మిగతా 3 లో




### హంగ్ మున్సిపాల్టీలపై
## బీఆర్ఎస్ నజర్

- 8 పట్టణాలకు సీనియర్ నేతలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకోవడమే లక్ష్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ -16ఫిబ్రవరి (మహాప్రభ).**
రాష్ట్రంలో హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టిసారించింది. మంగళవారం జరిగే మున్సిపల్ చైర్మెన్ల ఎన్నికలపై అప్రమత్తమైంది. ఎనిమిది పట్టణాలకు ఆ పార్టీ సీనియర్ నేతలకు ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించింది. కాంగ్రెస్ అరాచకాలపై పార్టీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మాట్లాడారు.
-మిగతా 3 లో

## కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాట..

శశిథరూర్, పవన్ ఖేరాపై మణిశంకర్ అయ్యర్ విమర్శలు 2 లో



# విదేశీ టూరిస్ట్, మరో మహిళపై అత్యాచారం

### ఒక వ్యక్తి హత్య..ముగ్గురికి మరణశిక్ష



**బెంగళూరు:-16ఫిబ్రవరి (మహాప్రభ).**
విదేశీ పర్యాటకురాలితోపాటు మరో మహిళపై సామూహిక అత్యాచారం, ఒక వ్యక్తి హత్య కేసులో సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించడంతోపాటు మరణశిక్ష విధించింది. కర్ణాటకలోని గంగావతి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు ఫిబ్రవరి 6న ముగ్గురు నిందితులైన మల్లేష్ అలియాస్ హాండిమాల్, సాయి, శరణప్పలను దోషులుగా నిర్ధారించింది. సోమవారం న్యాయమూర్తి సదానంద నాగప్ప నాయక్ ముగ్గురికి మరణ శిక్ష ఖరారు చేశారు. ఈ నేరం అత్యంత అరుదైన కేసు కిందకు వస్తుందని అందుకే గరిష్ట శిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.కాగా, 2025 మార్చి 6న హంపీకి నాలుగు కిలోమీటర్ల దూరంలోని సనాపూర్ సరస్సు వద్దకు పర్యాటకుల బృందం చేరుకున్నది. 27 ఏళ్ల ఇజ్రాయెల్ మహిళ, 29 ఏళ్ల హోమ్‌స్టే యజమానురాలు, అమెరికా, ఒడిశా, మహారాష్ట్రలకు చెందిన ముగ్గురు పురుషులు ఆ బృందంలో ఉన్నారు. రాత్రి భోజనం తర్వాత తుంగభద్ర కాలువ ఒడ్డున కూర్చుని గిటార్ వాయిస్తూ సంగీతాన్ని ఆస్వాదించారు.మరోవైపు ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అక్కడకు చేరుకున్నారు. టూరిస్ట్ బృందాన్ని డబ్బులు డిమాండ్ చేశారు. ముగ్గురు పురుషులపై దాడి చేశారు. వారిని కాలువలోకి తోశారు. ఇజ్రాయెల్ పర్యాటకురాలు, హోమ్‌స్టే మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారి మొబైల్ ఫోన్స్, నగదు తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. అయితే కాలువలో పడిన ఇద్దరు పురుషులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. మరో వ్యక్తి నీటిలో మునిగి మరణించాడు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను గుర్తించేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల్లోనే మల్లేష్ అలియాస్ హాండిమాల్, సాయి, శరణప్పలను అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన సెషన్స్ కోర్టు 11 నెలల్లోనే వారిని దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది.

# కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాట..


### శశిథరూర్, పవన్ ఖేరాపై మణిశంకర్ అయ్యర్ విమర్శలు



**న్యూఢిల్లీ-16ఫిబ్రవరి (మహాప్రభ).**
కాంగ్రెస్ పార్టీ లో అంతర్గత దావానలం రగులుతున్నది. ఒకరిపై ఒకరు సీనియర్ నేతలు విమర్శలు చేసుకుంటున్నారు. మాజీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ తన వ్యాఖ్యలతో మళ్లీ వివాదాన్ని లేవనెత్తారు. పార్టీ సభ్యులు, కేరళ రాజకీయాలపై అయ్యర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేదని అయ్యర్ అన్నారు. ఎందుకంటే పార్టీలోని నేతలే ఒకరిపై ఒకరు విద్వేషాన్ని చిమ్ముతున్నారని, కమ్యూనిస్టుల కన్నా ఎక్కువగా ఆ ద్వేషం ఉందని అయ్యర్ అన్నారు తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ అంశంలో శశి థరూర్ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. థరూర్‌ను యాంటీ పాకిస్తానీగా వర్ణించారు. బహుశా శశిథరూర్ విదేశాంగ మంత్రి కావాలనుకుంటున్నట్లు అయ్యర్ ఆరోపించారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఓ కీలుబొమ్మ అని అయ్యర్ పేర్కొన్నారు. ఆయనేమీ పార్టీ ప్రతినిధి కాదన్నారు. రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధి లేదరని, ఒకవేళ పవన్ ఖేరానే కొనసాగితే, అప్పుడు పార్టీ ఈ స్థాయిలోనే ఉంటుందన్నారు. కాంగ్రెస్ నేత జయరాం రమేశ్‌ను ఉద్దేశిస్తూ కూడా అయ్యర్ కొన్ని వ్యాఖ్యలు చేవారు. జై రాం తన పని తాను చూసుకోవాలన్నారు. అయ్యర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. కాంగ్రెస్ పార్టీతో అయ్యర్‌కు సంబంధం లేదని ఖేరా అన్నారు. ఆయన వ్యక్తిగతం వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆరోపించారు.

## భారత్ వేగవంతమైన అభివృద్ధికి


# ఏఐ సమ్మిట్ నిదర్శనం




**న్యూఢిల్లీ-16ఫిబ్రవరి (మహాప్రభ).**
దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను నిర్వహిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని అన్నారు. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందని చెప్పారు.సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమని ప్రధాని అన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమ్మిట్ మన దేశంలో జరుగుతుండటం గర్వకారణమని చెప్పారు. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం)' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ ఏఐ సమ్మిట్‌వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని ప్రధాని చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన లాంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఇవాళ్టి నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయని చెప్పారు.మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతమవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశమని ప్రధాని మోదీ వెల్లడించారు.

# త్రిషా వార్నింగ్‌తో దిగివచ్చిన తమిళనాడు బీజేపీ చీఫ్..

### తన వ్యాఖ్యలపై క్షమాపణ



**చెన్నై న్యూఢిల్లీ-16ఫిబ్రవరి (మహాప్రభ).**
తమిళ నటి త్రిషా వార్నింగ్‌తో పాటు, విమర్శల నేపథ్యంలో ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ దిగివచ్చారు. త్రిషాపై చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన క్షమాపణలు చెప్పారు. పొరపాటు వల్ల తాను అలా అన్నట్లు వివరణ ఇచ్చారు. 'ఇది పొరపాటున చేసిన ప్రకటన. అఖిల భారత మహిళా విభాగం చీఫ్ వానతి శ్రీనివాసన్, అన్నామలై ఈ విషయం గురించి నాతో మాట్లాడారు. నా ప్రకటన వల్ల ఎవరైనా బాధపడి ఉంటే, నేను నా హృదయపూర్వక క్షమాపణలు తెలియజేస్తున్నా' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, ఇటీవల జరిగిన ఒక సభలో తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్‌ను తమిళనాడు బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ లక్ష్యంగా చేసుకున్నారు. విజయ్‌కు రాజకీయాల పట్ల కనీస అవగాహన లేదని, ఆయన కేవలం సినిమాల్లో డ్యాన్సులు వేసుకోవడానికే పరిమితమని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లోకి వచ్చే ముందు తన కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. 'ఆయన (విజయ్) పూర్తిగా అనుభవం లేనివాడు. ముందు తన ఇంచి నుంచి ఆయన బయటకు రావాలి. ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు రా, అప్పుడు ఏదైనా జరుగుతుంది' అని నవ్వుతూ అన్నారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర చీఫ్ నైనార్ నాగేంద్రన్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. నటి త్రిషా కూడా దీనిపై తీవ్రంగా స్పందించారు. 'రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి ఇంత అసహ్యకరమైన, అనుచితమైన వ్యాఖ్యలు చేస్తారని ఎప్పుడూ ఊహించలేదు. రాజకీయాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాకు సంబంధం లేని విషయాల్లోకి నా పేరు లాగవద్దు. లేకపోతే పరువునష్టం దావా వేయాల్సి ఉంటుంది' అని త్రిషా హెచ్చరించారు. ఆమె తరుపు న్యాయ సలహాదారులు సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

## సూడాన్‌లో పారామిలిటరీ దారుణాలపై ఐరాస సంచలన నివేదిక

### మూడ్రోజుల్లోనే 6,000 మందికి పైగా అమాయక పౌరుల హత్య



**సూడాన్ -16ఫిబ్రవరి (మహాప్రభ).**
సూడాన్‌లో పారామిలిటరీ దళాలు సష్టించిన మారణకాండపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ చివరిలో దార్ఫుర్ ప్రాంతంలో కేవలం మూడు రోజుల్లోనే రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) దళాలు 6,000 మందికి పైగా పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చినట్లు తెలిపింది. 140 మంది బాధితులు, సాక్షులను ఇంటర్వ్యూ చేసి, శాటిలైట్ చిత్రాలతో సరిపోల్చి ఈ నివేదికను రూపొందించినట్లు ఐరాస తెలిపింది. ఈ హింస దిగ్భ్రాంతికరంగా ఉందని, ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలతో సమానమని ఐరాస మానవ హక్కుల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ మారణకాండపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చింది.


## చమురు ఎగుమతులను తగ్గించాలి..

### ఇరాన్‌పై అమెరికా ఒత్తిడి



**బీజింగ్ -16ఫిబ్రవరి (మహాప్రభ).**
ఒమన్ మధ్యవర్తిత్వంలో జెనీవాలో ఫిబ్రవరి 17 ఇరాన్- అమెరికాల మధ్య రెండో రౌండ్ అణు చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జెనీవా చర్చలకు ముందు అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. చైనాకు చమురు ఎగుమతులు తగ్గించాలని ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తీవ్రంగా కృషి చేస్తున్నారని వచ్చిన ఆక్సియోస్ నివేదికను బీజింగ్ తీవ్రంగా విమర్శించింది. ఇరాన్‌తో కదుర్చుకున్న తన చట్టబద్ధమైన ఆర్థిక సహకారానికి అమెరికా, ఇజ్రాయిల్ గౌరవించాలని చైనా కోరింది. అంతర్జాతీయ చట్టం పరిధిలో దేశాల మధ్య జరిగే సహకారం సహేతుకమైనది. చట్టబద్ధమైనది. దానిని గౌరవించి రక్షించాలి అని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ విడుదల చేసిన తాజా ప్రకటన పేర్కొంది. కాగా, బుధవారం జరిగే వాణిజ్య చర్చల్లో చైనాకు చమురు ఎగుమతులు తగ్గించాలని ఒత్తిడి చేసే ప్రయత్నం చేస్తోందని చైనా ఆరోపించింది.

## ప్రపంచవ్యాప్తంగా 'ఎక్స్' సేవల్లో తీవ్ర అంతరాయం



**న్యూఢిల్లీ-16ఫిబ్రవరి (మహాప్రభ).**
ప్రఖ్యాత సోషల్‌మీడియా వేదిక 'ఎక్స్' సేవల్లో సోమవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో 'ఎక్స్' సేవలు ప్రభావితమయ్యాయి.ఈ ఆకస్మిక అంతరాయంపై కంపెనీ ఎలాంటి వివరణా ఇవ్వకపోవటం లక్షలాది మంది యూజర్లను తీవ్రంగా నిరాశపర్చింది.

## కప్ప విషంతో రష్యా విపక్ష నేత నావల్నీ హత్య!



**లండన్: -16ఫిబ్రవరి (మహాప్రభ).**
రష్యా ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీని ఆ దేశంలోని పుతిన్ ప్రభుత్వం కప్ప విషమిచ్చి చంపిందని యూకే సహా నాలుగు యూరోపియన్ దేశాలు ఆరోపిస్తున్నాయి. బహుళ నిఘా సంస్థలతో చేపట్టిన దర్యాప్తులో ఈ విషయం తేలిందని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ తాజాగా ప్రకటించాయి.రష్యాలోని మారుమూల ఆర్కిటిక్ శిక్షా కాలనీలో పుతిన్ ప్రభుత్వం అతడ్ని బంధించగా, 2024 ఫిబ్రవరిలో నావల్నీ జైల్లోనే మరణించాడు. అతడ్ని ఖననం చేయడానికి ముందు అతడి శరీరం నుంచి నమూనాలను సేకరించి రెండు దేశాల ప్రయోగశాలలకు పంపారు. రసాయన ఆయుధాల్ని ప్రయోగించటం ద్వారా రష్యా 'కెమికల్ వెపన్స్ కన్వెన్షన్' ఒప్పందాన్ని ఉల్లంఘించినట్టు ఆరోపించాయి. క్వెడార్ డార్ట్ కప్పల చర్మంలో ప్రాణాంతక విషం నావల్నీ శరీరంలో కనిపించిందని నిఘా సంస్థలు చెబుతున్నాయి.

### ఫ్యూచర్ సిటీలో

# 'హెల్త్ సిటీ'

మొదటి తరువాయి

రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వివరించారు. రాష్ట్రాన్ని గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చాలనే సంకల్పంతో ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఏఐ ఆధారిత 'తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్'ను ప్రారంభించామన్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన 'రెడీ టూ వర్క్ ఫోర్స్'ను తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందనీ, మరో నాలుగు నెలల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌ను లాంఛనంగా ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్‌కు ధీటుగా రాష్ట్రంలోని టైర్ 2, టైర్ 3 నగరాలను కూడా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఆ నగరాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబుతో బిల్‌గేట్స్

# బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

మొదటి తరువాయి

గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నా మనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ఎ÷-లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరివృలించారు. అక్కడ పండించిన పంటలను పరిశీలించి అభినందించారు.

# నేటి నుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

మొదటి తరువాయి

ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

# ఇక ఈ అవమానాన్ని భరించలేను

మొదటి తరువాయి

కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌దే పైచేయి

మొదటి తరువాయి

11 చోట్ల ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 25 హంగ్ ఏర్పడిన స్థానాల్లో 15 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 5 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, 4 చోట్ల ఇండిపెండెంట్లు, మరోచోట ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు గెలుచుకున్నాయి. దీనితో కాంగ్రెస్‌పార్టీ గెలిచిన మొత్తం మున్సిపాలిటీల సంఖ్య 81కి చేరింది(ఫలితాల ప్రకటన రోజు కాంగ్రెస్ 66 చోట్ల పూర్తి మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే). బీఆర్ఎస్ సంఖ్య 18కి పెరిగింది. (ఫలితాల రోజు పూర్తి మెజారిటీతో బీఆర్ఎస్ 13 చోట్ల గెలిచింది). అలాగే 7 కార్పొనేషన్లకు జరిగిన ఎన్నికల్లో ఐదింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ కార్పొరేషన్లను దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్లు అదిలాబాద్, జమ్మికుంట, మహబూబాబాద్, భైంసా మున్సిపాలిటీలను గెలుచుకున్నారు. అయితే వీరంతా కాంగ్రెస్ మద్దతుతోనే గెలిచారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై గెలిచిన వారందరూ కాంగ్రెస్‌లో చేరామని ప్రకటించినప్పటికి అధికారికంగా ఎన్నికల సంఘం వారిని గుర్తించలేదు. దాంతో వారు ఫార్వర్డ్ బ్లాక్ నుంచే గెలిచారని ప్రకటించింది. మున్సిపాలిటీల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో హస్తం హవా కొనసాగింది. ఇక్కడ 80 శాతానికి పైగా చైర్మెన్ పదవులను ఆ పార్టీ దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. మెదక్ జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాలిటీలో కోరం లేక చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఆ జిల్లాలో మిగిలిన 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 9 స్థానాలను దక్కించుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల మున్సిపాలిటీని ఆ పార్టీ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మున్సిపాలిటీలో ఒక్క స్థానం దక్కిన కాంగ్రెస్‌కు చైర్మెన్ పీఠం దక్కింది. ఇక్కడ మొత్తం 15 వార్డులుండగా.. బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ ఒక్క వార్డులో గెలిచింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిల ఎక్స్ అఫిషియో ఓట్లతో ఆ సంఖ్య మూడుకు చేరింది. వారికి బీజేపీ సభ్యులు మద్దతు పలకడంతో ఒక స్థానంలో గెలిచిన హస్తం అమనగల్‌ను హస్తగతం చేసుకుంది.

**5 కార్పొరేషన్లలో 'హస్తం'**

మున్సిపల్ కార్పొరేషన్లలోనూ హస్తం జోరు కొనసాగింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో 5 చోట్ల మేయర్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా పాతిపల్లి ఎల్లయ్య, మంచిర్యాల మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా సల్ల రమ్య మహేశ్, మహబూబ్‌నగర్ మేయర్‌గా గుమల్ మమత, డిప్యూటీ మేయర్‌గా ఎం సురేందర్ రెడ్డి, నల్లగొండ మేయర్‌గా బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. నిజామాబాద్, నల్లగొండ డిప్యూటీ మేయరుగా ఎంఐఎంకు చెందిన సల్మాతాహిన్ ఎండీ.అష్రఫ్‌అలీ గెలిచారు. కొత్తగూడెం, నిజామాబాద్, నల్లగొండ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను ఏఐఎంఐఎం గెలుచుకుంది. కొత్తగూడెం మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. ఆ పార్టీ కార్పొరేటర్ మూడ్ గణేశ్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారీకి దక్కింది. చివరి క్షణం వరకు ఉత్కంఠగా సాగిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీ వశమయ్యాయి. ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, వై.సునీల్ రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

**11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా**

రాష్ట్రంలోని11 మున్సిపాలిటీల్లో వివిధ కారణాల వల్ల చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడ్డట్టు ఎన్నికల సంఘం తెలిపింది. గతంలో ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కోరం లేక పోవడం, లేదా మరే ఇతర కారణాల వల్ల 16న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడితే ఆ మరుసటి రోజు 17న నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే వాయిదా పడ్డ మున్సిపాలిటీల ఎన్నిక నిర్వహణ తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

మొదటి తరువాయి

వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# కరీంనగర్‌పై బీజేపీ జెండా

మొదటి తరువాయి

ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచినప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది. బీఆర్ఎస్ ఎటువైపు మొగ్గు చూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది.ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్ఎస్ 9 స్థానాలు, స్వతంత్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.

# పశువులకూ ముఖ ఆధారిత గుర్తింపు!




అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయాన్ని 2026-27 వ్యవసాయ బడ్జెట్ ప్రసంగంలో మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు కోటి పశువులు ఉండగా, ప్రతి పశువుకు ముఖ ఆధారిత గుర్తింపు నమోదు చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మనుషుల మాదిరిగానే ఏ పశువుకైనా ముక్కు మీద చర్మపు ముడతలు ఒకేలా ఉండవని చెప్పారు. గతంలో పశువుల చెవులకు వేసే ట్యాగ్ నంబరునే పశువుకు ఆధార్‌గా పరిగణించారు. అయితే అక్రమ రవాణా సమయంలో ట్యాగ్‌ను పీకేస్తున్నారు. దీనివల్ల అక్రమ రవాణా జరిగే పశువుల్ని పట్టుకున్నా.. ఏ పశువు ఎవరిదో గుర్తించడం కష్టంగా ఉంటోంది. ముఖ ఆధారిత గుర్తింపు వల్ల పశువుని గుర్తించడం చాలా తేలికని అంటున్నారు. ఈ విధానాన్ని త్వరలో కుప్పంలోనూ ప్రవేశపెట్టడానికి పశు సంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇదే విధానాన్ని పశుసంవర్ధక శాఖ సహకారంతో ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ప్రముఖ బీమా కంపెనీ కూడా ముందుకొచ్చిందని అధికారులు తెలిపారు.

## హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ నజర్

మొదటి తరువాయి

స్థానికంగా కాంగ్రెస్ చేస్తున్న అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుని, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించుకోవడమే లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపైన బీఆర్ఎస్ అండగా ఉందని భరోసానిచ్చారు. మంగళవారం ఎన్నికలు జరగనున్న ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టంగా చైర్మెన్ పీఠాలను గెలుచుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఈ ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా తమ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేరని చెప్పారు.

# రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

మొదటి తరువాయి

ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# సంపాదకీయం

## పక్కా నీటి ప్రణాళికలే మేలు !



పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్లయినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాతలను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది.

# బండ్ల ఊరేగింపు సందర్భంగా పోలీస్ బందోబస్తు పరిశీలన.

-ఏడుపాయల వన దుర్గామాత జాతరకు భారీగా తరలివస్తున్న భక్తులు.

-తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు.

-ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి.

-జాతర ప్రాంతమంతటా నిరంతర నిఘా, కట్టుదిట్టమైన భద్రత.

-మెదక్ అదనపు ఎస్పీ మహేందర్.



**మెదక్ -16ఫిబ్రవరి (మహాప్రభ)**

ఏడుపాయల మహాశివరాత్రి రెండో రోజు జాతర సందర్భంగా జరుగుతున్న రెండవ రోజు ఏడుపాయల వన దుర్గామాత జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బండ్ల ఊరేగింపును పురస్కరించుకొని అదనపు ఎస్పీ మహేందర్ జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును స్వయంగా పరిశీలించారు. బండ్ల ఊరేగింపు మార్గం, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను అదనపు ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏడుపాయల వన దుర్గామాత జాతర రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతుండటంతో, బండ్ల ఊరేగింపును తిలకించేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి తొక్కిసలాటలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ గారు ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధంగా నియంత్రించడం, పార్కింగ్ ప్రాంతాల్లో సిబ్బందిని నియమించడం, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే జాతర ప్రాంతమంతటా నిరంతర పోలీస్ నిఘా కొనసాగిస్తూ, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని అదనపు ఎస్పీ తెలిపారు.

# మహాశివరాత్రి సందర్భంగా రెండవ రోజు జాతర..





## బండ్ల ఊరేగింపు

**మెదక్ జిల్లా 16 ఫిబ్రవరి (మహాప్రభ)**

మహాశివరాత్రి జాతరలో రెండో రోజు జాతరలో ముఖ్య ఘట్టమైన బండ్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర ప్రజలే కాక ఇతర రాష్ట్రాల నుండి ప్రజలు, చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు లక్షలాదిగా తరలిరావడంతో బండ్ల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా కొనసాగింది. జానపదుల సంస్కృతికిఅద్దం పట్టే విధంగా రెండవ రోజైన సోమవారం బోనాల ఊరేగింపుతో జోరు కొనసాగింది. పోతరాజు నృత్యాలతో కనువిందు చేసింది.. శివసత్తుల గజ్జెలతో దద్దరిల్లిపోయింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే మహాజాతరలో బండ్ల ఊరేగింపు సోమవారం సాయంత్రం అట్టహాసంగా కొనసాగింది.. ఉదయం నుండే భక్తులు హైదరాబాద్, కర్నాటక,ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి తరలిరాగా ఏడుపాయల జాతరకు అన్ని రహదారులు ఏడపాయల వైపు మర్లాయి. ఆనకట్ట పోతిరెడ్డిపల్లి చౌరస్తా గుండా చీమల దండును తలపించే విధంగా భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మౌళిక సదుపాయాలను భక్తులు విని లాగించుకొని పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకుంటున్నారు. పోతరాజుల గావుకేకలు.. బోనాలతో నృత్యాలు.. దుర్గనామస్మరణతో ఏడుపాయల జాతర హోరెత్తింది. బండ్ల ఊరేగింపు కార్యక్రమం తిలకించేందుకు వచ్చిన భక్తులతో వనం జనంతో జనారన్యంగా మారింది. అమ్మవారి ముందు తిప్పే బండ్లకు రవికలు, చీరలు,కొబ్బరి మట్టలు, దేవతామూర్తుల చిత్రపటాలు, మెరుపు కాగితాలతో అలంకరించిన 'బండ్లపై శివసత్తులు శివాలూగ తుండగా గంటలతో ఎడ్లు పరుగులు తీస్తుండగా బండ్లు తిరుగుడు కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఏడు పాయల జాతరలోనే అత్యంత ప్రత్యేక ఘట్టాన్ని తిలకించడానికి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏడుపాయల జాతరలో రెండవరోజైన సోమవారం ఉదయం 05.00గం.నుండి ప్రత్యేక పూజలు చేసి దుర్గమ్మ దర్శనాన్ని ప్రారంభించారు. ఆదివారం రాత్రికి భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో ఏడుపాయల జనారణ్యంగా మారింది. తెల్లవారు జామునుండే మంజీరా నదిలో స్నానాలు చేసిన భక్తులు దుర్గమ్మను దర్శించుకుని ఉపవాస దీక్షలు విరమించారు. గంట గంటకు భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. దుర్గా మాతకు జై అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఏడుపాయల కొండ కోనలు ప్రతిధ్వనించాయి.

**భోనాలతో ఆకట్టుకున్న నృత్యాలు:**

తలపై గండ దీపాలు.. బోనాలతో నృత్యాలు.. పోతరాజుల గావుకేకలు గుమ్మటాల ఊరేగింపులతో జాతర కిక్కిరిసింది. నెత్తిపై బోనం పెట్టుకుని చేతిలో జర్నకోల పట్టుకుని డప్పు చప్పుళ్లకు అనుగుణంగా లయబద్ధంగా చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంత మహిళలు చేసిన నృత్యాలు యువకు లను ఉర్రూతలూగించాయి.

**జాతరలో కన్నుల పండువగా బండ్ల ఊరేగింపు**

ఏడుపాయల జాతరలోనే అత్యంత ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జానపదులు,తమబండ్లను చీరలు,రవికలు,కొబ్బరి మట్టలు,దేవతామూర్తుల చిత్రపటాలు, రంగురంగుల మెరుపు కాగితాలు,గాలి నీమ్మకాలతో అలంకరించారు. వాటిపై వేమకొమ్మలు చేతపట్టుకున్న శివభక్తులు శివాలు ఊగ తుండగా గంటల చప్పుళ్లతో ఎడ్లు పరుగులు తీశాయి. అనాధిగా వస్తున్న ఆచారం ప్రకారం పాపన్నపేట సంస్థాన ధిశుల బండికి ఆలయ అధికారులు స్వాగతం పలుకగా బండి ముందు డప్పుచప్పుళ్లకు అనుగుణంగా వందలాది మంది యువకులు చిందులు వేయగా దుర్గమ్మ తల్లికి జై అంటూ లక్షలాది మంది భక్తులు ఏడుపాయల గుట్టలు పతిధ్వనితో సంస్థానాధీశుల బండి వెనక బండ్లు ఊరేగింపు కొనసాగింది. మెదక్ డిఎస్పీ ,ఆర్డీవో రమాదేవి బండ్ల ఊరేగింపును అనుక్షణం పర్యవేక్షించారు.

**పాపన్నపేట నుండి బయలు దేరిన సంస్థానాధీశుల బండి ఊరేగింపు.**

ఏడుపాయల జాతర ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో మండల కేంద్రమైన పాపన్నపేట సంస్థా నాధీశుల బండి ఊరేగింపుకు పాపన్నపేట గ్రామప్రజలు బండిని అలంకరించి గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి గ్రామ పొలిమేర వరకు భారీ సంఖ్యలో గ్రామప్రజలు, మహిళలు తరలివచ్చి సంస్థానాధీశుల బండిని ఎంతో అధరణగా యువకులు డప్పుచప్పుడ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఏడుపాయలకు సాగనంపారు. ఈఊరేగింపు కార్యక్రమంలో పాపన్నపేట సర్పంచ్ లింగం పేట పావని నరేందర్ గౌడ్,ఉప సర్పంచ్ సద్దాం,మాజీ ఉప సర్పంచ్ ఎండీ.ఖలీం,శెట్టి శ్రీకాంత్, ముషెట్టి కిష్టయ్య,సుంకరి శివయ్య,తప్ప రాములు, పాపన్నపేట తాజామాజి సర్పంచ్ తిమ్మయగారి గురుమూర్తిగౌడ్,దోసని సంగమేశ్,తదితరులు ఉన్నారు. ఏడుపాయల జాతరలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 900 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో,మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. అంతే కాకుండా మెదక్ డిఎస్పీ సైతం జాతర భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

**జాతరలో నిరంతరాయంగా విద్యుత్ సేవలు**

ఏడుపాయల వనదుర్గామాత జాతరలో మెదక్ ఎస్సీ నారాయణ నాయక్ ఆధ్వర్యంలో మెదక్ డి ఈ రామేశ్వర స్వామీ పర్యవేక్షణలో పాపన్నప్పేట ఏడిఈ వెంకటేశ్వర్లు అద్వర్యలో ఏఈలు,లైన్ ఇన్స్పెక్టర్ల తో సిబ్బంది జాతరలో మకాం వేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తమ తమ సేవలందిస్తున్నారు. జాతరలో డిపిఆర్ ఓ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు మెదక్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి రామచందర్ రాజు ఆధ్వర్యంలో జాతరలో ప్రతీ రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# మెదక్ మున్సిపల్ ఎన్నికైన చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ గా దొంతి నరేష్ గౌడ్.

## అభినందించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్.



**మెదక్ జిల్లా-16ఫిబ్రవరి (మహాప్రభ).**
కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మున్సిపల్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ లను ఆయన అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సాధించిన విషయాన్ని ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టి మెదక్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం అభినందనీయమన్నారు. నూతనంగా ఏర్పడిన పాలకవర్గం పట్టణాభివృద్ధికి కృషి చేస్తూ సేవలందించాలని ఆయన నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కు ఆయన సూచించారు. ప్రజలు నమ్మకం ఉంచి గెలిపించిన కౌన్సిలర్లు పట్టణాభివృద్ధికి ఐక్యంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పట్టణాభివృద్ధికి గాను తన వంతుగా రాష్ట్ర ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేస్తారని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన కానుగు రాధిక, దొంతి నరేష్ గౌడ్ లను, కౌన్సిలర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గెలుపొందిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు మెదక్ పట్టణంలో అన్ని వార్డులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు. పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యువత సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలి

## బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.



**గడ్డి అన్నారం - 16 ఫిబ్రవరి (మహాప్రభ)**
సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్గురు సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవ కార్యక్రమానికి గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ లర్పించారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, ఆయన చూపిన సేవా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శంకర్ నాయక్, ఇంద్ర నాయక్, కుమార్ నాయక్, అశోక్ నాయక్, శరత్ నాయక్, సమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం సర్పంచుల ఉదారత

## సొంత ఖర్చులతో కాల్వ మరమ్మతులు




**దుబ్బాక - ఫిబ్రవరి 16 (మహాప్రభ)**
రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పంటలు ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి పోతారం, అచ్చుమాయిపల్లి, గ్రామాల సర్పంచుల పర్స దేవరాజు, స్వల్కం మల్లేశం గార్ల సొంత డబ్బులతో ఇద్దరి సమన్వయంతో కాలువ నిర్మాణం కోసం అవసరమైన సిమెంట్ పైపులను కొనుగోలు చేసి తెప్పించారు, హిటాచి తెప్పించి కాలువ గండ్లు పడిన చోట పుడుస్తున్నారు మల్లన్న సాగర్ 4వాణ కాలువ పనులు ఈరోజు పనులు జరుగుతున్నాయి, ఫోటోలకు ఫోజులిచ్చి రైతులను తప్పుదోవ పట్టించే కొంతమంది స్వార్ధ రాజకీయ నాయకుల మాటలు నమ్మకుండా, కాల్వ పనులు ఆటంకం కలగకుండా ముందుకు తీసుకుపోయేందుకు రైతులందరూ సహకరించాలని అన్ని గ్రామాల ప్రజలను కోరారు, ఈ కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు, ముందుకు వచ్చి రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని కాల్వ పనులు ప్రారంభించినందుకు రెండు గ్రామాల సర్పంచులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# ఉపసర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీవో సోమిరెడ్డికి ఘన సన్మానం



**దుబ్బాక -ఫిబ్రవరి 16 (మహా ప్రభ)**
అక్బర్ పేట భూశీపల్లి మండలం ఉప సర్పంచులు ఈరోజు సమావేశంలో స్థానిక మండల అభివృద్ధి అధికారి సోమిరెడ్డిని కలిసి గ్రామ పంచాయతీ అభివృద్ధిలో మా ఉప సర్పంచులకు కూడా సహకరించగలరని కోరినారు, అదేవిధంగా మండలం ఉన్నత అధికారుల కలిసి ప్రతి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ లకు అభివృద్ధిలో ఉన్నత అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల ఉపసర్పంచులు మండల కోశాధికారి దమ్మగౌని ప్రవీణ్ గౌడ్, సలహాదారులు జీడిపల్లి రమేష్ కూడావెల్లి స్వామి బేగంపేట్ సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారవేత్త కన్నుమూత



**ఆమనగల్లు, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కండె లింగయ్య సోమవారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజకీయ నాయకులు, ఆయన నివాసానికి చేరుకొని నివాళి అర్పించారు. తన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబాన్ని ఓదార్చారు.

# దుబ్బాకలో నూతన పాలకవర్గం ఎన్నిక





## దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ గా శ్రీరామ్ సంగీత

**దుబ్బాక - ఫిబ్రవరి 16 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ ఎన్నికల్లో ఓర ఓరి పోటీలో బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు అధికసీతను కైవసం చేసుకున్న విషయం తెలిసింది నేడు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారానికి మహోత్సవానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు నలుగురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బిజెపి పార్టీ తరపున గెలిచిన ఇద్దరు కౌన్సిలర్లతోపాటు ఇండిపెండెంట్ గా గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారానికి హాజరైయారు ఎక్స్ అఫీషియ సభ్యుడుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు ఆర్డీవో సదానందం ఆధ్వర్యంలో కౌన్సిలర్ ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నిక కొనసాగింది. మున్సిపల్ చైర్ పర్సన్ గా శ్రీరామ్ సంగీత, వైస్ చైర్మన్గా పర్సన్ గా ఆస సులోచను ఎన్నుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లు గా గెలుపొందిన నుండి క్యాంపు లో ఉన్న బిఆర్ఎస్ నాయకులు నేరుగా మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకారానికి వచ్చిన చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నుకోవడంతో దుబ్బాకలో చైర్మన్ ఎవరు అవుతారని ఉత్కంఠకు తెరపడింది మున్సిపల్ చైర్మన్ రేస్ లో బి ఆర్ ఎస్ పార్టీలో శ్రీరామ్ సంగీత తో పాటు బండి శ్రీలేఖ పోటీ పడడంతో చైర్మన్గా ఒకరి పేరు నిర్ధారణ అయితే మరొకరు ఇతర పార్టీల కౌన్సిలర్ల సహాయంతో చైర్మన్ అవుతారని ఊహాగానాలు ఆవిరైపోయాయి, ఈ సందర్భంగా నూతనగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ సంగీత వైస్ చైర్ పర్సన్ అస సులోచన ప్రజలకు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపల్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు తమను చైర్మన్గా ఎన్నుకున్న కౌన్సిలర్లకు శ్రీరామ్ సంగీత కృతజ్ఞతలు తెలిపారు.

# వేంకటేశ్వర ఆలయంలో ఘనంగా శివకేశవుల కళ్యాణం




**వినోభా నగర్, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని తిరుకల్యాణ మహోత్సవం వేదపండితుల నేతృత్వంలో అంగరంగ వైభవంగా జరిగింది.పండితులు శివపార్వతుల, తిరుకల్యాణ విశిష్టతను భక్తులకు వివరించి ఆధ్యాత్మికతను చాటారు. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.మహాశివరాత్రి సందర్భంగా చెరుకు రసం, రత్నపురి గడ్డ, పండ్లు, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఇమ్మడి లక్ష్మీనారాయణ చెరుకు రసం, ఇల్లెందుల సంతోష్ కజ్జూర్ పండ్లకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.500 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని శివకేశవుల కళ్యాణాన్ని దర్శించి అనుగ్రహం పొందారు.

# మాంబట్టులో ఆమహా శివుడికి రెండో రోజు కళ్యాణ బ్రహ్మోత్సవం





**ఫిబ్రవరి 16 (తడ మండలం) మహాప్రభ**
మాంబట్టు గ్రామం తడ మండలం తిరుపతి జిల్లా లో జరుగుతున్న ప్రసిద్ధిగాంచిన శ్రీ గంగా అన్నపూర్ణేశ్వర దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కళ్యాణ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన కళ్యాణానికి ముఖ్య పాత్ర వహిస్తున్న సన్నారెడ్డి దశరథ రామిరెడ్డి, శ్రీమతి శ్యామలమ్మ, ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్న దేవస్థాన చైర్మన్ కామిరెడ్డి వెంకిరెడ్డి, స్వామివారికి అలంకరణ పూజాభిషేకాలు కళా నృత్యాలు, కోలాటాలు ముమ్మరంగా జరుగుతున్నాయి ఈ మహా శివుని దర్శించుకోవడానికి చుట్టుపక్క గ్రామ ప్రజలు తండోపతండాలుగా వచ్చి ఆ నీలకంటేశ్వరుడి నీ దర్శించుకుని పూజ అభిషేకాలు తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరుగుతున్నాయి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేయూతనిస్తున్న వేనాటి జనార్ధన్ రెడ్డి, వేనాటి రాజారెడ్డి, కామిరెడ్డి రమణారెడ్డి, చిల్లకూరు సురేష్ రెడ్డి,డాక్టర్ కారణి మునస్వామీ,వేమనబోన భాస్కర్, పాముల సుబ్బారావు,పాల్చూరు మోహన్ రావు, మునయ్య, పెన్ను విజయ, మరియు గ్రామ పెద్దలు చేత మహాశివరాత్రి వేడుకలు ఊరేగింపు జరుగుతుంది.

# భ్రమరాంబ మల్లికార్జున దేవాలయమును దర్శించుకున్న

- భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు
- యువత కృషితో మల్లేశం పల్లి దేవాలయం వెలుగులోకి
- దేవాలయ అభివృద్ధి లక్ష్యంగా కదిలిన గ్రామం
- త్వరలో గోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభం



**దుబ్బాక - ఫిబ్రవరి 16 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మల్లేశం పల్లి గ్రామంలో వెలిసిన 500 సంవత్సరాల చరిత్ర కలిగి ప్రసిద్ధి చెందిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ఎవరు పట్టించుకోవడంలేదని కొందరు యువకులు, గ్రామ ప్రజలు కలిసి అద్భుతంగా దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది వెలుగులోకి తీసుకొచ్చారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని మల్లేశం పల్లి గ్రామం నిరూపించారని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. దేవాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దేవాలయం అభివృద్ధి కమిటీ వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివుని ఆజ్ఞతో నేడు మల్లేశం పల్లి గ్రామం ప్రజలతో భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం రూపు దిద్దుకోవడం అర్షనీయం అన్నారు. దేవాలయం చుట్టుప్రక్కల పచ్చని పంట పొలాలు పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొన్న ఈ దేవాలయం రాబోయే రోజుల్లో భక్తులతో కళకళలాడునన్నారు. భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పుగా మల్లన్న దేవాలయం పూజలు అందుకుంటున్నారు. త్వరలో ఈ గ్రామంలో గోటి తలంబ్రాల కార్యక్రమం ప్రారంభిస్తానన్నారు. కమిటీ వారు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ భక్త బృందం గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి, ఆకాంక్షలు, ఆశయాల కోసం ఈ2026-27 బడ్జెట్ 3.32 కోట్లు

## ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**ఫిబ్రవరి 16 (సూళ్లూరుపేట) మహా ప్రభ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లే విధంగా2026-27 సంవత్సర బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలియజేశారు. నాయుడుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అటు అభివృద్ధి పథంలో ఇటు సంక్షేమం సమపాళ్లలో చేసుకుంటూ డబుల్ ఇంజన్ సర్కార్ లా ముందుకు దూసుకుని వెళుందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో 2019 నుండి2024 వరకు 2.79 లక్షల కోట్లు మాత్రమే బడ్జెట్ ప్రవేశపెట్టారని, కానీ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో 3.32 లక్షల కోట్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రాన్ని బలోపేతం చేస్తూ, రాష్ట్రానికి ఎన్నో కంపెనీలు తీసుకొని వస్తూ, అన్ని రంగాల అభివృద్ధి కోసం ఈ బడ్జెట్ అని, గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం కోసం అని చెప్పి అప్పులు చేశారని, కానీ కూటమి ప్రభుత్వం సంపద సృష్టించి రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టును త్వరితి గతిన పూర్తి చేసే విధంగా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలకు కూడా బడ్జెట్ రూపొందించడం జరిగిందని, మన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి పిల్లలకు యూనిఫామ్, బుక్స్, బ్యాగులు, ఒక క్లాస్ ఒక టీచర్ అని అప్ గ్రేడ్ చేస్తూ, 3,4,5 తరగతులకు ఒకే టీచర్ ఉన్న పాఠశాలలను ఒక తరగతికి ఒకే టీచర్ అంటూ విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. రెవెన్యూ, విద్యా, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఆరోగ్యం, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, మొదలగు అన్ని శాఖలకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని, ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

# మల్లన్న స్వామి ఆశీస్సులు అందరికి కలగాలి

బ్రహ్మోత్సవాల్లో సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**చింతపల్లి, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
ప్రతి ఒక్కరూ తీదేడు మల్లన్న స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. గ్రామంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దాతల సహకారంతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, పి.ఏ.సి.యస్ మాజీ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దాసరి తిరుపతయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మద్రు రామారావు, రావు వెంకట్ నర్సింహారావు, మోర కిరణ్ బాబు, కాయితి బచ్చిరెడ్డి, మద్రు శ్రీనివాసరావు, మద్రు మీనారావు, శివర్ల పర్వతాలు యాదవ్, మద్రు సురేందర్ రావు, జూలురి శ్రీధర్, సిమర్ల శ్రీను యాదవ్, జెల్ల వెంకటేశ్వర్లు, శివర్ల అంజయ్య, మర్ల మల్లయ్య, శివర్ల వెంకటయ్య, శివర్ల మల్లేష్, శివర్ల శివశంకర్, ఉడుత శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత జాతర ఉత్సవాలు

**శివంపేట/ - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
శివంపేట మండల కేంద్రంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రోజులపాటు ఘనంగా దుర్గామాత ఉత్సవాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దుర్గామాత జాతరకు పరిసర గ్రామాల నుంచి కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు గౌరంగం వంటి కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గజవాడ లావణ్య నాగరాజు

వైస్ చైర్మన్‌గా పోచమ్మల నవనీత





**రామాయంపేట - ఫిబ్రవరి 16 ( మహాప్రభ**
రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గజవాడ లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికై, సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ముందుగా,ఎన్నికైన 12 మంది వార్డు కౌన్సిలర్లతో ఇంచార్జి ప్రొసీడింగ్ అధికారి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, డీఎల్‌పీఓ సాయిబాబా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను చేపట్టగా, మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో గజవాడ లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.చైర్‌పర్సన్ ఎన్నిక అనంతరం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకే చెందిన పోచమ్మల నవనీత గణేష్ ను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇరువురు నేతలు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులకు, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్ లను కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన పాలకవర్గం పేర్కొన్నారు.

# మానవత్వం చాటుకున్న జనసేన నాయకుడు.

జనసేన నాయకుడు హరిబాబు సన్ శెట్టి.



**గడ్డి అన్నారం -16 ఫిబ్రవరి (మహాప్రభ)**
గడ్డి అన్నారం పరిధిలో ఆర్ కే పురం కాలని లో గత మూడు నెలల నుంచి ఒంటరిగా రోడ్డుపై జీవనం సాగిస్తున్న వృద్ధ మహిళ చూసి అమ్మ నీకు ఎవరు లేరా అంటూ నేను ఉన్నాను ధైర్యం అని జనసేన నాయకుడు హరిబాబు నాయుడు సన్ శెట్టి అన్నారు, అనాధ ఆశ్రమంలో చేర్పిస్తాను అడగడంతో మహిళ వెంటనే నాకు ఎవరు లేరయ్యా అంటూ చెప్పడం జరిగింది,వెంటనే స్పందించిన జనసేన నాయకుడు ఆ కాలనీవాసులతో విచారించి తోటి స్నేహితులతో కలిసి చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు, పోలీస్ సిబ్బంది సాయంతో మహిళా కానిస్టేబుల్ తీసుకెళ్లి ఆ వృద్ధ మహిళను అనాధాశ్రమంలో చేర్పించడం జరిగింది,ఈ సహాయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి హరిబాబు ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థుల ప్రతిభ శ్లోకది గ్లోబల్ స్కూల్‌కు గర్వకారణం




**ఎల్.బి.నగర్, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
శ్లోక ది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కాగ్నో క్వెస్ట్ 2025--26లో రన్నరప్ అవార్డు సాధించచారు. శ్లోక ది గ్లోబల్ స్కూల్ కు గౌరవాన్ని తెచ్చిపెట్టిన విద్యార్థులను స్కూల్ నిర్వాహకులు అభినందించారు. 7వ తరగతి విద్యార్థులు గుణశ్రీ, మన్విత, 6వ తరగతి విద్యార్థులు దివిషా, శివాంశ్ ప్రతిభ, కృషి, సృజనాత్మకత, జట్టు భావనకు వారు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి.జైపాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రిన్సిపల్ వి.అంజనా శ్రీ, వైస్ ప్రిన్సిపల్ జీ. నరేష్, సైన్స్ ఉపాధ్యాయుడు దీక్షిత్, ఉపాధ్యాయుల బృందం.. విద్యార్థినీ విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ పాఠశాల ప్రతిష్టను మరింత పెంచాలని మనస్ఫూర్తిగా కోరారు.

# సన్నాలకు బోనస్

-మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా



**కడ్తాల్, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్వింటాల్కు రూ.500 బోనస్ కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.514.36 కోట్లు విడుదల చేసిందని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ముదిరాజ్ తెలిపారు. వానాకాలం సీజన్లో సన్నాలు అమ్మిన రైతుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు ఈ బోనస్ అదనంగా లభించనుందన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందాన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ యువ నాయకులు వికాస్.

**సంగారెడ్డి జిల్లా 16, - ఫిబ్రవరి 16 ( మహాప్రభ )**
కంది మండల ఇంద్రకరణ్ బీ ఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వికాస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో రావడం ఖాయం. కెసిఆర్ మల్ల తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు.

# బిజినెస్

## బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల జోరు.. భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో జోరుగా కొనుగోళ్లు జరగడం సూచీలకు కలిసొచ్చింది. దాంతో గత రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం 82,480.40 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెక్సెక్స్.. క్రమంగా కోలుకుని లాభాలబాట పట్టింది.చివరికి సెన్సెక్స్ 650 పాయింట్ల లాభంతో 83,277.15 వద్ద ముగియగా.. నిఫ్టీ 211.65 పాయింట్ల లాభంతో 25,682.75 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తగ్గిన బంగారం ధర.. కానీ వెండి ధరలు మాత్రం.?

బంగారం ధరలు కుప్పకూలాయి. ఈ మధ్య కాలంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిన ధరలు సోమవారం నేల చూపులు చూశాయి. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిర పరిస్థితులు చక్కదిద్దుకునే అవకాశాలు కనిపిస్తుండటంతో పసిడి ధరలు శాంతిస్తున్నాయి. జనవరి నెలలో దాదాపు రూ.లక్షా 80 వేలకు చేరిన బంగారం ధరలు ఫిబ్రవరిలో ఒక్కసారిగా భారీగా పడిపోయి రూ.లక్షా యాభై వేల దిగువకు చేరాయి. ఇంకా కిందకు దిగివచ్చే అవకాశాలు ఉన్నాయనే నిపుణులు అంచనాలు పసిడి ప్రియులకు భారీ ఊరటను కలిగిస్తున్నాయి. కాగా ఫిబ్రవరి 16 సోమవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ. 1,310లు తగ్గి రూ. 1,56,440 పలుకుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ. 1,200




తగ్గి, రూ. 1,43,400 లకు చేరింది. వెండి ధర మాత్రం గత మూడురోజులుగా స్థిరంగా కొనసాగుతోంది. ఈరోజుకూడా కిలో వెండి ధర రూ. 2,80,000 గా కొనసాగుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో సోమవారం బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,56,590 దగ్గర ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,43,550 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,56,440 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ. 1,43,400 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,57,530 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1,44,400 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,56,440 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,43,400 లు పలుకుతోంది. కిలో వెండి ధర రూ. 2,80,000లుగా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## స్నాప్‌డీల్‌కు రూ. 5 లక్షల జరిమానా

న్యూఢిల్లీ

ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్నాప్‌డీల్‌కు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) సోమవారం రూ. 5 లక్షల జరిమానా విధించింది. టార్సు (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్ 2020ను ఉల్లంఘిస్తూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఎస్ఐ) ప్రమాణాలకు అనుగుణంగా లేని బొమ్మలను విక్రయించినందుకు సిసిపిఎ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై పూర్తిగా విచారణ చేసిన తరువాతే జరిమానా ఉత్తర్వు జారీ చేసినట్లు సిసిపిఎ చీఫ్ కమిషనర్ నిధి ఖరే మీడియాకు తెలిపారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇతర ఈ కామర్స్ సంస్థలకు, స్టాలియన్ ట్రేడింగ్ కంపెనీ, ఎలక్ట్రానిక్స్ బజార్ స్టోర్ వంటి విక్రేతలకు కూడా ఈ విధమైన నోటీసులు జారీ చేసినట్లు నిధి ఖరే తెలిపారు. స్నాప్‌డీల్‌కు జరిమానా విధించడంతో పాటు ఇక నుంచి బిఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా లేని ఏ బొమ్మనూ లిస్ట్‌లో విక్రయించవమని, ఉంచమని, ప్రచారం చేయమని హామీ ఇవ్వాలని స్నాప్‌డీల్‌ను సిసిపిఎ ఆదేశించింది. అలాగే, వినియోగదారుల ఫిర్యాదు కోసం ఫిర్యాదు అధికారి వివరాలు, కాంటాక్ట్ నంబరు, ఇ-మెయిల్ అడ్రస్‌లు ప్రముఖంగా ప్రదర్శించాలని స్నాప్‌డీల్‌ను కోరింది. 2021 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం భారత్‌లో విక్రయించే అన్ని బొమ్మలకు బిఐఎస్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేశారు.

# స్పోర్ట్స్

## పాక్ ఓటమిని శాసించింది వీరే..

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు పాకిస్థాన్‌పై మరో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దాంతో సూపర్-8లో తన స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది. ఎంతో ఉత్కంఠ రేపుతుందని ఆశించిన ఫ్యాన్స్ కు నిరాశ కలిగిస్తూ ఏకపక్షంగా సాగిన మ్యాచులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో అద్భుత ప్రదర్శన చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 175 పరుగులు బోర్డుపై ఉంచింది. టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆరంభంలోనే షాక్ తగిలినప్పటికీ, ఆ తర్వాత మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇషాన్ వేగంగా పరుగులు రాబడుతూ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్ అయ్యాడు. తన పరుగులతో భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ఇషాన్ కిషన్ అవుట్ అయిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌ను




చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ తిలక్ వర్మతో కలిసి భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 170 దాటించడంలో కీలకపాత్ర పోషించాడు. . సూర్య 29 బంతుల్లో 32 పరుగులు చేయగా.. చివర్లో ఆల్ రౌండర్ శివమ్ దూబె 158.82 స్ట్రైక్ రేట్‌తో 27 పరుగులు చేశాడు. దాంతో భారత్ ఈ పిచ్ మీద పాక్‌కు భారీ టార్గెట్ ఇవ్వగలిగారు. 175 పరుగుల టార్గెట్ కాపాడుకునే క్రమంలో బరిలోకి దిగిన భారత జట్టుకు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. హార్దిక్ పాండ్యా తన మొదటి ఓవర్లోనే పాకిస్థాన్ ఓపెనర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. 3 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తన బౌలింగ్ లో పాక్ బ్యాటర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వలేదు. పాక్ స్పిన్నర్లతో ఇబ్బంది పెడితే భారత్ మాత్రం పేసర్లు, స్పిన్నర్లతో పాక్ ను కట్టడి చేసింది.భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన స్పెల్‌లో సయీమ్ అయూబ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను బ్యాక్‌ఫుట్‌లోకి నెట్టాడు. బుమ్రా బౌలింగ్ తో పాక్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్ రాణించాడు. పాకిస్థాన్ కీలక బ్యాటర్లను అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించేలా చేశాడు. వీరికి తోడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో భారత్ తన గ్రూపులో అగ్రస్థానాన్ని నిలుపుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో పాక్ పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. భారత్ నెక్స్ట్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.

## సూపర్ 8లోకి ఇంగ్లండ్.. ఇటలీపై 24 రన్స్ తేడాతో గెలుపు




కోల్‌కతా:

టీ20 వరల్డ్‌కప్‌లో ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 24 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఆ జట్టు గ్రూపు సీ నుంచి సూపర్ 8లోకి వెళ్లింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 202 రన్స్ స్కోరు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇటలీ 178 రన్స్ చేసి ఆలౌటైంది. ఇటలీ ప్లేయర్ బెన్ మానెంటి 25 బంతుల్లో 60 రన్స్ చేసి కాసేపు దడపుట్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. జస్టిస్ మోస్కా 34 బంతుల్లో 43 రన్స్, గ్రాంట్ స్టీవార్ట్ 23 బంతుల్లో 45 రన్స్ చేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ శరవేగంగా హాఫ్ సెంచరీ కొట్టాడు. కేవలం 22 బంతుల్లో అతను 53 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 28, జాకబ్ బేతల్ 23, టామ్ బాంటన్ 30 రన్స్ స్కోరు చేశారు.

## 10 వ తరగతి పరీక్షలకు వైభవ్ సూర్యవంశీ డుమ్మా!

టీమ్ ఇండియా అండర్-19 ప్రపంచ కప్ 2026 టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది నుంచి నిత్యం వార్తల్లో నిలుస్తున్నాడు ఈ టీనేజ్ సంచలనం. ఇటీవల వైభవ్ సూర్యవంశీ 10వ తరగతి పరీక్ష రాయబోతున్నాడని వార్త వచ్చింది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ పరీక్షలకు హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని క్రికెటర్ వైభవ్ తండ్రి స్వయంగా తెలిపారు. తాజ్‌పూర్ లోని మోడెస్టీ పాఠశాల ప్రిన్సిపాల్ ఆదర్శ్ కుమార్ అలియాస్ పింటూ మాట్లాడుతూ వైభవ్ సూర్యవంశీ తండ్రితో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ బిజీ షెడ్యూల్ కారణంగా వైభవ్ పరీక్షలు రాయలేకపోతున్నాడని,




అయితే అతని ప్రిపరేషన్స్, ఎగ్జాట్ సెంటర్ సంబంధించిన అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయని ఆయన అన్నారు. మొదట తాను పరీక్షలకు హాజరు కావాలని బీసీసీఐని పర్మిషన్ అడిగాడని వార్తలు వచ్చాయి. కానీ అండర్ 19 టీం బిజీ షెడ్యూల్స్, మ్యాచ్‌లకు అందుబాటులో ఉండేందుకు టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రాయడం లేదని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం వైభవ్ సూర్యవంశీ ఎగ్జామ్ సెంటర్ పోద్దార్ ఇంటర్నేషనల్ స్కూల్, సమస్తిపూర్ లో ఉంది. స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ ఈ విషయాన్ని ధృవీకరిస్తూ వైభవ్ అడ్మిట్ కార్డు వచ్చిందని, అన్ని అవసరమైన డాక్యుమెంట్లు స్కూల్ యాజమాన్యం వద్ద భద్రంగా ఉంచామని చెప్పారు. వైభవ్ సాధారణ విద్యార్థిలాగే పరీక్షకు వస్తాడని, అతని కోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని ఆయన స్పష్టం చేశారు.



## నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా

### తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్

సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

## బోలెడంత అందం ఉన్నా.. అవకాశాలు మాత్రం నిల్లు..

ఇండస్ట్రీలో అందం అభినయం ఉన్నా అదృష్టం లేని భామ ఎవరు అంటే ముందు వరసలో కనిపించే పేరు కేతిక శర్మ. . బోలెడంత అందం ఉన్నా అదృష్టం లేని చిన్నది ఈ అమ్మడు. రొమాంటిక్ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది కేతిక శర్మ. తొలి సినిమాలోనే రొమాంటిక్ సీన్స్ లో దుమ్మురేపింది. ఆకాష్ పూరి హీరోగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆతర్వాత లక్ష్య అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. కానీ ఈ అమ్మడికి ఆఫర్స్ ఆగలేదు. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా, అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో సినిమాలో చేసింది. కానీ ఆ సినిమా కూడా అంతగా ఆకట్టుకోలేకపోయింది. మొన్నామధ్య సింగిల్ అనే సినిమా చేసింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.ఈ సినిమాతో కేతిక అకౌంట్ లో మొదటి హిట్ పడింది. కానీ ఈ అమ్మడి ఆతర్వాత ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం రావడం లేదు. నితిన్ సినిమాలో స్పెషల్ సాంగ్ లో కనిపించింది. అందంతో కవ్విస్తున్నా ఈ చిన్నదానికి మాత్రం ఆఫర్స్ రావడం లేదు.. ప్రస్తుతం కొత్త సినిమా ఏది అనౌన్స్ చేయలేదు కేతిక. ఇప్పుడు ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది. ప్రస్తుతం కేతిక చేతిలో సినిమాలు ఏవి లేవు. కానీ సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడి ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది.







## కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న కుర్ర భామ..

టాలీవుడ్ లో కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. ఈ క్రమంలోనే శివాని నాగరం అనే ముద్దుగుమ్మ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఈ అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు గాయని , కూచిపూడి నృత్యకారిణి కూడా.. ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఆమె ప్రస్తుతం "లిటిల్ హార్ట్స్" అనే సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, "ఆరంభం" అనే సినిమాలో "అమాయకంగా" అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. ప్రస్తుతం సుహాస్ హీరోగా నటిస్తున్న హే భగవాన్ సినిమాలో నటిస్తుంది ఈ అమ్మడు. ఈ సినిమా ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫొటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ బ్యూటీ ఫోటోలకు కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. ఆమె తన సహజమైన అందం, నటనా నైపుణ్యంతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకుంటుంది. శివాని హైదరాబాద్‌కు చెందిన తెలుగు అమ్మాయి. తెలుగు నటీమణులకు సినిమా రంగంలో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ.

## ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం



ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## మెగా మూవీలో చాన్స్?



మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com